హైదరాబాద్ వార్త

కుర్చీ నీదా.. నాదా..!

- జూబ్లీ సీటుపై రేవంత్.. కెటిఆర్ యుద్ధం - నియోజకవర్గంలో ప్రచార హోరు



జూబ్లీహిల్స్, అక్టోబరు 31, ప్రభాతవార్త: ఇది పార్టీ అభ్యర్థుల మధ్య కాదు.. రెండు ప్రధాన పార్టీల నేతల మధ్య యుద్ధం.. ఉన్న సీటును దక్కించుకొనేందుకు ఒకరు.. సీటును చేజిక్కించుకొని తమ ఖాతాలో వేసుకొనేందుకు మరొకరు.. అందుకే.. ఇద్దరు ఇప్పుడు ఈ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారు.. జూబ్లీలో విజయం సాధించి రాష్ట్ర స్థాయిలో తమ జెండాకు తిరుగు లేదని తేల్చిచెప్పేందుకు ఇద్దరు సమరానికి సిద్ధమయ్యారు.. అందుకే ఇప్పుడు జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక రెండు ప్రధాన పార్టీల జయాపజయాలపై కేంద్రీకృతమైంది.

కాంగ్రెస్.. అస్త్రశస్త్రాలు

జూబ్లీహిల్స్ నియోజకవర్గంపై రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే 24 క్రాఫ్ట్స్‌కు చెందిన సినీ కార్మికులతో సమావేశమైన ఆయన వారికి వరలా జల్లు కురిపించారు. కార్మికుల పిల్లలకు పాఠశాల సౌకర్యం, కార్మికులకు ఆరోగ్యశ్రీ, టిక్కెట్ ధరలు పెంచితే 20 శాతం కార్మిక నిధికి ఇచ్చేలా జీఓ, కార్మికుల నిధికి రూ. 10కోట్లు ఇలా అనేక వరాలను ఇచ్చాడు. దీనికితోడు అక్టోబరు 31న వెంగళ్‌రావునగర్, సోమజీగూడ, 1న బోరబండ, ఎర్రగడ్డ, 4న షేక్‌పేట-1, రహ్మత్‌నగర్, 5న షేక్‌పేట-2, యూసుఫ్‌గూడలో ఆయన ప్రచారం కొనసాగనుంది. వీటితోపాటు నవంబరు 8న ఆరు డివిజన్లలో బైక్ ర్యాలీ, అలాగే 9న షేక్‌పేటలో బైకు ర్యాలీలో ఆయన పాల్గొంటారు. ఇందుకోసం ఇప్పటికే కాంగ్రెస్ శ్రేణులు ఆయా కార్యక్రమాల కోసం అవసరమైన సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు దాదాపు 1.20 లక్షలు ఉన్న మైనార్టీ ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు అజారుద్దీన్‌కు మంత్రి పదవిని కట్టబెట్టారు. ఇవే కాకుండా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం ఇప్పుడు జూబ్లీహిల్స్ నియోజవర్గంపై దృష్టి సారించింది. గెలుపు లక్ష్యంగా పావులు కదుపుతూ ముందుకు సాగుతుంది. అయితే క్షేత్రస్థాయిలో ఉండాల్సిన మంత్రులు కాస్త పైపైన ప్రచారం నిర్వహిస్తూ ముందుకు సాగుతుండటం, ఫొటోలకు పరిమితమవుతున్నారంటూ పోలీసు నిఘా వర్గాలు ఇప్పటికే సీఎంఓ కార్యాలయానికి నివేదికలు అందించాయి. ఈ క్రమంలోనే జూబ్లీ సీటును సొంతం చేసుకొని తన పవర్‌ను చాటేందుకు రేవంత్‌రెడ్డినే స్వయంగా ఇక్కడ ప్రచార కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

క్షేత్రస్థాయిలో మమేకమవుతూ..

బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జూబ్లీహిల్స్ స్థానాన్ని నిలబెట్టుకొనేందుకు అవరమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని బీఆర్ఎస్ కంచుకోటగా తీర్చిదిద్దారు. తొలిసారి టీడీపీ నుంచి గెలుపొందిన తరువాతి కాలంలో బీఆర్ఎస్ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన అకాల మరణంతో ఉప ఎన్నికలు వచ్చి పడ్డాయి. ఈ క్రమంలోనే ఆయన సతీమణికి అన్ని పార్టీల కంటే ముందుగానే బీఆర్ఎస్ అభ్యర్థిగా పార్టీ ప్రకటించి ఎన్నికల శంకారావం పూరించారు. ఈ సీటును ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కేటీఆర్ ఈ సీటును గెలుచుకొనేందుకు పార్టీ నాయకత్వాన్ని మొత్తం రంగంలోకి దించాడు. బూత్‌ల వారీగా నేతలను నియమించి ఆయా బూత్‌లలోని ఓటర్ల బాధ్యతను వారికి అప్పగించారు. ఆయా నాయకులు సైతం తమకు కేటాయించిన డివిజన్లలో ఉంటూ ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో చేపడుతున్నారు. ఈ సీటును గెలుచుకొని తద్వారా రాష్ట్రస్థాయిలో పార్టీ జెండా ఎగురవేయాలని ఆయన భావిస్తున్నారు. ఈ క్రమంలోనే కేటీఆర్ స్వయంగా కొన్ని వాట్సప్ గ్రూపులకు సైతం అడ్మిన్‌గా ఉండి అందరిని సమన్వయం చేస్తున్నాడు.

రాష్ట్ర ఏక్తా దివస్ 2025లో భాగంగా నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహించిన ఐక్యత రన్ కార్యక్రమంలో పాల్గొన్న సినీనటుడు చిరంజీవి డిజీపీ శివధర్‌రెడ్డి,హైదరాబాద్ నగర పోలీసు కమీషనర్ సజ్జనార్ ,సందీప్ శాండిల్య ,యంయం భగవత్,తదితరులు

క్రికెటర్ టు మినిస్టర్..

మంత్రిగా అజహరుద్దీన్ ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, అక్టోబరు 31,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు హాజరయ్యారు. కాగా అజారుద్దీన్ హైదరాబాద్‌లో 1963 ఫిబ్రవరి 8న జన్మించారు. అబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో ప్రాథమిక విద్యను అభ్యసించారు. నిజాం కళాశాలలో బీకాం చదవారు. తన మేనమామ జైనులాబుద్దీన్ స్ఫూర్తితో క్రికెట్ రంగం వైపు అడుగులు వేశారు. 1984 లో అజారుద్దీన్ అంతర్జాతీయ క్రికెట్‌లో రంగప్రవేశం చేసి క్రికెటర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అప్పట్లో తొలి మూడు టెస్టుల్లోనూ సెంచరీలతో సంచలనం సృష్టించారు. 1989లో భారత క్రికెట్ టీమ్ కెప్టెన్‌గా అజారుద్దీన్ భాధ్యతలు చేపట్టారు. 16 ఏళ్ల సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో 99 టెస్టులు, 334 వన్డేలు ఆడారు. రిటైర్మెంట్ అనంతరం రాజకీయాల్లోకి వచ్చారు. 2009 ఫిబ్రవరి 19వ తేదీన కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే ఏడాది యూపీలోని మొరాదాబాద్ స్థానం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2018లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అజారుద్దీన్‌ను నియమించారు. ఇప్పుడు తాజాగా రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

ముస్లిం మైనార్టీ వర్గానికి అవకాశం..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికార బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ముస్లిం మైనార్టీ వర్గానికి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ నాయకత్వం భావించింది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన ఒక్కరూ విజయం సాధించకపోవడంతో ఆ సామాజిక వర్గానికి పదవి ఇచ్చే అవకాశం లేకుండా పోయింది. గతంలో జూబ్లీహిల్స్ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన అజారుద్దీన్‌కు తిరిగి అక్కడ జరిగే ఉప ఎన్నికలో పోటీ చేసే అవకాశం వచ్చింది. గతంలో 16 వేల ఓట్ల తేడాతో ఓడిపోయిన అజారుద్దీన్‌తో తిరిగి పోటీ చేయించడం కంటే, గవర్నర్ కోటా కింద శాసన మండలి సభ్యుడిగా అవకాశం కల్పిస్తే బాగుంటుందని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు అజారుద్దీన్‌తో పాటు తెలంగాణ జనసమితి అధ్యక్షుడు(టీజేఎస్) కోదండరామ్‌ను గవర్నరు కోటా కింద ఎమ్మెల్సీగా ఎంపిక చేయాలని నిర్ణయించారు. అందుకు సంబంధించి గవర్నర్‌కు ప్రతిపాదనలు పంపారు. గవర్నర్ కోటా కింద అజారుద్దీన్ ఎంపిక విషయంలో ఏదైనా సాంకేతికపరమైన ఇబ్బంది తలెత్తితే వచ్చే ఏడాదిలో ఖాళీ కానున్న ఎమ్మెల్సీల్లో ఇతర కోటా కింద ఎంపిక చేసేందుకు అవకాశం ఉందని అంచనా వేసిన ఆల్‌ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆ నిర్ణయం తీసుకుంది. మైనారిటీ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వడం ద్వారా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కలిసి వస్తుందని భావిస్తోంది.

టిడిపి మాజీ ఎంపి ఇంట్లో వజ్రాభరణాలు చోరి

జూబ్లీహిల్స్, అక్టోబరు 31, ప్రభాతవార్త: జూబ్లీహిల్స్‌లో మాజీ ఎంపీ కంభంపాటి రాంమోహనరావు ఇంట్లో చోరి జరిగింది. దేవి నవరాత్రి పూజ సందర్భంగా దేవి విగ్రహానికి అలంకరించిన వజ్రాలతో కూడిన బంగారు వంకీలు మాయం అయిన సంఘటన కలకలం రేపింది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్‌లో నివసించే కంభంపాటి రామోహన్‌రావు నివాసంలో ప్రతి ఏడాదిలానే ఈ సంవత్సరం సెప్టెంబరు 22న నవరాత్రులు ప్రారంభించారు. విగ్రహానికి బంగారు గొలుసులు, వజ్రాలతో పొదిగిన మూడు వరుసల వంకీలు అలంకరించారు. అక్టోబరు 2న పూజ సమయంలో ఒక వజ్రాల బంగారు వంకీ కనిపించలేదు. రోజువారి తాము తీసుకున్న ఫొటోలను పరిశీలించగా విగ్రహం ఏడమ చేతి నుంచి మాయమైనట్లు గుర్తించారు. ఇంట్లో అంతా వెదికినా కనిపించకపోవడంతో పూజ నిర్వహించిన సమయంలో ఉన్నవారితోపాటు ఇంట్లో పనిచేసే ఇంట్లో పనిచేసే వారిపై అనుమానం వ్యక్తం చేస్తూ కంభంపాటి రామోహన్‌రావు వ్యక్తిగత సహాయకుడు వల్లమల్ల శ్రీకాంత్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా చోరీకి గురైన వజ్రాభరణాల విలువ దాదాపు రూ. 3లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బేగంపేటలో స్వల్ప అగ్ని ప్రమాదం...

బేగంపేట అక్టోబరు 31,ప్రభాతవార్త

బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ లో స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది.ఈ ప్రమాదంలో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. వివరాలిలా ఉన్నాయి.శ్యాంలాల్ బిల్డింగ్‌లోని అపార్ట్‌మెంట్‌లోని ఓ ప్లాట్ బాల్కనీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి.దుస్తులను ఆరవేసే చోట అకస్మాత్తుగా మంటలు రావడంతో ప్లాట్‌లె ఉన్న వారు భయాందోళనకు గురయ్యారు.అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో అక్కడే చిన్నారిని గమనించి చిన్నారిని వెంటనే అక్కడి నుంచి సురక్షితంగా కుటుంబసభ్యులు కాపాడారు.ఇది గమనించిన స్థానికులు నీళ్లతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.ఈసంఘటనలో ఎలాంటి ప్రమాదం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఘటనకు షార్ట్ సర్క్యూట్ కారణమా,లేక మరేదైనా కారణమా తెలియాల్సి ఉంది.

ప్యారడైజ్ మెట్రో స్టేషన్ నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

-గాయాలపాలైన వ్యక్తికి గాంధీలో చికిత్స

బేగంపేట అక్టోబరు 31,ప్రభాతవార్త

బేగంపేట పోలీసు స్టేషన్ పరిధిలోని ప్యారడైజ్ మెట్రో స్టేషన్ లో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మెట్రో స్టేషన్ నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.ఇది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్పందించిన పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని గాయాలపాలైన వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.అయితే మెట్రో స్టేషన్ పై నుంచి దూకి గాయపడిన వ్యక్తి ఎవరు అనే వివరాలను వెల్లడించలేక పోవడంతో అతను ఎవరు అనేది తెలియడం లేదు.అతని నుంచి స్పష్టత వచ్చాకే అతను ఎవరు ఎక్కడి నుంచి వచ్చాడు.ఎందుకు ఆత్మహత్యకు యత్నించాడు అన్న విషయాలు తెలిసే అవకాశం ఉంది.అయితే గాయపడిన వ్యక్తికి గాంధీలో చికిత్స అందిస్తున్నామని,అతను కోలుకున్నాక పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉందని బేగంపేట ఇన్స్‌పెక్టర్ సైదులు తెలియజేసారు.

లిఫ్టు తీగలు తెగి ఉపాధ్యాయులకు గాయాలు

కొంపల్లి, అక్టోబర్ 31 ప్రభాతవార్త:

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్ పరిధిలోని గౌతమి మోడల్ స్కూల్లో శుక్రవారం లిఫ్టు తీగలు తెగిపోవడంతో లిఫ్టులో ఉన్న ఏడుగురు ఉపాధ్యాయులు గాయాలపాలైయ్యారు. రోజు మాదిరిగానే స్కూల్‌కు వచ్చిన ఉపాధ్యాయులు వారివారి తరగతులను పూర్తి చేసుకొని మధ్యహ్నం ఫస్టిఫ్లోర్ నుండి సెల్లార్‌లోకి లిఫ్టులో వస్తుండగా ఒక్కసారిగా లిఫ్టు తీగలు తెగిపోయాయి. ఈప్రమాదంలో లిఫ్టులో ఉన్న ఉపాధ్యాయులు శ్రీవాణి, రజిత, దీపిక, ప్రత్యూష, రజిని, నాగశ్రీ, లక్ష్మీదుర్గలు గాయాలపాలైయ్యారు. గమనించిన యాజమాన్యం వారిని చికిత్స నిమిత్తం స్థానికంగా ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈసంఘటనకు సంబంధించి మాకు ఏటువంటి ఫిర్యాదులు అందలేదని బాచుపల్లి పోలీసులు పేర్కొన్నారు

రూ.30 కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

-కబ్జాల చెర నుంచి 4 వేల గజాల పార్కుకు విముక్తి

-లేఔట్ వేసిన వారే కబ్జాలకు పాల్పడినట్లు గుర్తింపు

హైదరాబాద్, అక్టోబర్ 31,ప్రభాతవార్త:

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘటకేసర్ మండలం పోచారం మున్సిపాలిటీ చౌదరిగూడ, డాక్టర్స్ కాలనీలో 4000 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. దీని విలువ రూ. 30 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. 1985లో 26.9 ఎకరాలపరిధిలో500 ప్లాట్లతో లేఔట్ వేసిన నాటి భూ యజమానులే ఈ కబ్జాలకు పాల్పడడం యిక్కడ గమనార్హం. యిదే విషయమై చౌదరిగూడలోని డాక్టర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు ఈ ఫిర్యాదును హైడ్రా అధికారులు సంబంధిత శాఖలతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. లేఔట్ వేసినప్పుడు 4 వేల గజాల స్థలాన్ని పార్కుగా చూపించిన వారి కుటుంబ సభ్యులు తప్పుడు డాక్యుమెంట్స్ తో 4 వేల గజాలను 800 గజాల చొప్పున 5 ప్లాట్లుగా అమ్మేసినట్టు తేలింది. అతర్వాత కులకర్ణి అనే వ్యక్తి వాటిని 200 గజాల చొప్పున 20 ప్లాట్లుగా చేసి రాజేష్, సోమాని తో పాటు పలువురికి అమ్మేశారు. ఈ విషయమై మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసారు. హైకోర్టును కూడా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఆశ్రయించారు. యిలా దశాబ్దాలుగా పరిష్కారం కానీ సమస్యతో గత నెల సెప్టెంబరులో హైడ్రాను ప్రతినిధులు ఆశ్రయించారు. విచారణ పూర్తి చేసి.. పార్కు స్థలంగా నిర్ధారించుకున్న హైడ్రా అధికారులు శుక్రవారం ఆక్రమణలు తొలగించారు. 4 వేల గజాల పార్కు స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా బోర్డు లు ఏర్పాటు చేసారు. దీంతో పార్కు కబ్జాకు తెరపడింది. యిప్పుడు కాలనీ ప్రతినిధులు ఊపిరి పీల్చుకున్నారు.

విజయేంద్ర సరస్వతి స్వామిజీని దర్శించుకున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్, అక్టోబర్ 31 ప్రభాతవార్త:

శ్రీ శ్రీ శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామిజీని దర్శించుకుంటున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ పద్మరావునగర్ స్కందగిరి టెంపుల్‌లో శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామిజీని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి దర్శించుకున్నారు. విజయేంద్ర సరస్వతి స్వామిజీ స్కందగిరి టెంపుల్ లో జరుగుతున్న ప్రత్యేక కార్యక్రమాలకు హాజరయ్యారు. విజయేంద్ర సరస్వతి స్వామిజీని దర్శించుకోడానికి ముందు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి టెంపుల్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిజీని దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆయన పూలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ పాల్గొన్నారు.

శీతకాల పార్లమెంట్‌లో సమావేశాల్లో బిసి బిల్లు పెట్టకపోతే ముట్టడిస్తాం

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరిక

సైఫాబాద్, అక్టోబరు 31 ప్రభాతవార్త:

సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో శంకర్‌రావు తదితరులు

వచ్చే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్‌లపై 50 శాతం సిలింగ్ ఎత్తివేస్తూ బిల్లు తీసుకురావాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు, లేనిపక్షంలో నవంబరు 25 తరువాత వేలాది మంది బిసిలతో పార్లమెంట్ భవనాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎపి బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్‌రావు, తదితరులతో కలిసి ఆయన మాట్లాడుతూ 50 శాతానికే రిజర్వేషన్‌ల పరిమితి అని ఎక్కడ లేదని, పరిమితి పేరుతో బిసిలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్‌లు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిసిల జనాభా ప్రకారం రిజర్వేషన్‌లు కావాలని, మా జనాభా ఎంతో, వాటా అంతా ఇవ్వాలని, 10 శాతం కంటే తక్కువగా ఉన్న అగ్రవర్ణ పేదలకు కేంద్రం 10 శాతం రిజర్వేషన్‌లు కేటాయించడంతో సిలింగ్ సమస్య పోయినట్లయిందన్నారు. ఇప్పటికైనా కేంద్రం పార్లమెంట్‌లో బిల్లు పెట్టి అమోదించాలని, లేకపోతే అవసరమైతే ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రుల నివాసాలను ముట్టడిస్తామని జాజుల హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కులగణన చేపట్టేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇది బిసిల విజయమన్నారు. స్థానిక సంస్థల్లో బిసిలకు రిజర్వేషన్‌ల కోసం తాము ఉద్యమం చేపట్టామని, ఇక నుంచి చట్ట సభలలో రిజర్వేషన్‌లు సాధించడమే లక్ష్యంగా పోరాటాలను ఉధృతం చేస్తామని జాజుల హెచ్చరించారు. ఈ సమావేశంలో బిసి నేతలు బిసి నేతలు కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, కుందారం గణేషాచారి, కనకాల శ్యామ్‌కుర్మ, తదితరులు పాల్గొన్నారు.

పూడిక తీత ఆపొద్దు..

నాలాల్లో నీరు నిలవొద్దు

నగరంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయి పర్యటన

చెరువులు, నాలాలను పరిశీలన..స్థానికులు, అధికారులకు సూచనలు

హైదరాబాద్, అక్టోబరు 31,ప్రభాతవార్త: కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చిన విద్యార్థినుల హైదరాబాద్, అక్టోబర్ 31: వర్షాలు తగ్గుముఖం పట్టాయి. నాలాల్లో వరద ప్రవాహం తగ్గే అవకాశం ఉంది. ఈ పరిస్థితులను వినియోగించుకుని నాలాల్లో పూడికను పూర్తి స్థాయిలో తొలగించాలని హైడ్రా డీఆర్ఎఫ్, మెట్ టీమ్‌లకు కమిషనర్ రంగనాథ్ దిశానిర్దేశం చేశారు. నగరవ్యాప్తంగా నాలాల్లో పూడిక తీసే పనులను ముమ్మరం చేయాలని సూచించారు. చాలా వరకు పూడికను తొలగించడంతో ఈ ఏడాది భారీ వర్షాలు పడినా ఎక్కడా వరద ముప్పు ఏర్పడలేదని.. వచ్చే ఏడాది అస్సలు ఈ సమస్య తలెత్తే అవకాశం లేకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రజావాణి ఫిర్యాదుల మేరకు నగరంలోని నాలాలను, చెరువులను పరిశీలిస్తూ వస్తున్న హైడ్రా కమిషనర్ శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్, బోరబండ ప్రాంతాలలో నాలాల్లో పూడిక తీత పనులను పర్యవేక్షించారు. అలాగే ప్రాంతాల వారీ వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి సమాచారాన్ని చేరవేయాలని సూచించారు. అలాగే హరిహరపురంలోని కాప్రాయి చెరువుతో పాటు.. శంషాబాద్, పెద్దగోల్కొండలోని నరసింహ చెరువు, బాలాపూర్ మండలంలోని కోమటి కుంటను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని చెరువులను తగిన మొత్తంలో ఖాళీ చేయించి.. వరద నీరు నిలిచేలా చూడాలన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని హరిహరపురం కాలనీలో ఉన్న కాప్రాయి చెరువుకు ఔట్‌లెట్‌లు లేక ఎగువున ఉన్న తమ కాలనీలు నీట మునుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ పరిశీలించారు. ఇన్‌లెట్ ద్వారా ఎంత మొత్తంలో వరద వస్తుందో అంతే మొత్తం కిందకు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. వరద నీరు చెరువులోకి వెళ్లకుండా డైవర్ట్ చేయడం వల్ల స్నేహమయినగర్, అఖిలాండేశ్వరి, గ్రీన్‌ల్యాండ్స్ తో పాటు ఏడెనిమిది కాలనీలు నీట మునుగుతున్నాయన్నారు. మరీ ముఖ్యంగా కాప్రాయి చెరువు కింద ఉన్న కాలనీల్లోని నాలాల్లో పూడికను తొలగిస్తే మురుగు రహదారులను ముంచెత్తకుండా జాగ్రత్త పడవచ్చునన్నారు. పూడిక తీత నిరంతర ప్రక్రియగా సాగాలని సూచించారు. వెంటనే ఈ పనులు చేపట్టాలని హైడ్రా డీఆర్ ఎఫ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు.

విద్యార్థినుల వినతిపత్రం..

శంషాబాద్ మండలం చిన్నగోల్కొండ, పెద్ద గోల్కొండ ఔటర్ రింగురోడ్డు అండర్ పాస్‌లు వరద నీటిలో మునుగుతున్నాయని తాము పాఠశాలకు వర్షాకాలం వెళ్లలేకపోతున్నామని విద్యార్థినులు రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ బస్సులో తాము స్కూల్‌కు వెళ్తామని.. ఇటీవల తాము ప్రయాణిస్తున్న బస్సు అండర్‌పాస్ కింద నీటిలో ఆగిపోవడంతో ఇబ్బంది పడ్డామని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఇక్కడ అండర్ పాస్‌లన్నిటి పరిస్థితి ఇలాగే ఉంటుందని..వర్షం పడితే ఇబ్బందిగా పరిణమిస్తున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇక్కడ వరద కాలువల్లో పూడికను తొలగించి.. సరైన విధంగా నిర్వహిస్తే ఈ సమస్యకు పరిష్కారం చూపవచ్చునని.. వెంటనే ఈ పనులు చేపట్టాలని హైడ్రా కమిషనర్ అధికారులకు సూచించారు. ఔటర్ రింగురోడ్డు ఎగ్జిట్ 15 వద్ద చెరువు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. త్వరలోనే ఇరిగేషన్ అధికారులతో పాటు.. చెరువు వాస్తవ విస్తీర్ణం ఎంతో నిర్ధారించి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఐసిసిఇ వద్ద రన్ ఫర్ యూనిటీ

నృత్యం చేస్తూ అలరిస్తున్న డీసీపీ శ్రీనివాస్, గోపిచంద్, సోహైల్, మహబూబ్ తదితరులు.

బంజారాహిల్స్, అక్టోబర్ 31, ప్రభాతవార్త: సర్దార్ వల్లభాయి పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని పశ్చిమ మండల పోలీసుల ఆధ్వర్యంలో బంజారాహిల్స్ లోని ఐసీసీసీ కేంద్రం వద్ద రన్ ఫర్ యూనిటీ పేరుతో రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పశ్చిమ మండల డీసీపీ చింతమనేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ తోపాటు నటులు సోహైల్, మహబూబ్, అదనపు డీసీపీ గోవర్ధన్ బంజారాహిల్స్ ఏసిపి వెంకటరెడ్డి పంజాగుట్ట ఏసిపి మురళీకృష్ణ, ఇన్స్పెక్టర్లు వెంకటేశ్వర రెడ్డి, కేఎం రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని పుల్లెల గోపీచంద్ ప్రారంభించారు. దాదాపు కిలోమీటర్ మేర దూరం సాగింది. ఈ ర్యాలీలో విద్యార్థులు, పోలీసులు ఉత్సాహంగ్ పాల్గొన్నారు. అనంతరం ఐసీసీసీ కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన వేదికపై ఫిట్నెస్ ట్రైనర్ దీపికతో కలిసి పోలీస్ అధికారులు నటులు ఉత్సాహంగా నృత్యాలు చేసి అందరినీ అలరించారు. సర్దార్ పటేల్ ఐక్యమత్య స్ఫూర్తిని చాటుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డిసిపి శ్రీనివాస్ తెలిపారు.

జెహెచ్‌పిఎస్‌కు అవార్డులు

జూబ్లీహిల్స్, అక్టోబర్ 31, ప్రభాతవార్త: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్(జేహెచ్‌పీఎస్)కు ప్రతిష్టాత్మక ఎల్డ్‌రోక్ ఇండియా కె-12 అవార్డు దక్కింది. విద్యార్థులలో విద్యా నైపుణ్యాన్ని తీసుకురావడం, ప్రోత్సహించడం తదితర అంశాల్లో ఫుర్టాడోస్ స్కూల్ ఆఫ్ మ్యూజిక్ సీఈఓ, వ్యవస్థాపకురాలు ధరణి నుంచి పాఠశాల డైరక్టర్ వరలక్ష్మి అవార్డును అందుకున్నారు. నియో టచ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ దురైస్వామి కందస్వామి జేహెచ్‌పీఎస్ ప్రిన్సిపల్ కాంచనవల్లికి కె-12 లో అవసరమైన సంస్కరణలు తీసుకొచ్చినందుకు అవార్డు అందించారు. విద్యలో నైపుణ్యం, బోధనలో కొత్త ఆవిష్కరణలు, సమగ్ర విద్యార్థుల అభివృద్ధి పట్ల ఉన్న అంకితభావానికి ఈ అవార్డు అందించారు.

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అధ్యక్షుడుగా ఆచార్య గోపాల్ రెడ్డి

గోపాల్‌రెడ్డి, రాజమహేంద్రరెడ్డిలను సత్కరిస్తున్న విద్యాసమితి అధ్యాపకులు, సిబ్బంది

నాంపల్లి, అక్టోబరు 31 ప్రభాతవార్త : ఉభయ తెలుగురాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విభాగాలకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అధ్యక్షుడుగా ఆచార్య గోపాలరెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విజయనగర్ కాలనీ విజయనగర్ విద్యా సమితి కళాశాల, సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించి గౌరవించారు. ఆచార్య గోపాలరెడ్డి ప్రస్తుతం విజయనగర్ విద్యాసమితి ఛైర్మన్‌గా కూడా కొనసాగుతున్నారు. అలాగే విజయనగర్ విద్యాసమితి కార్యదర్శి రాజమహేంద్రరెడ్డి తెలంగాణ చిన్న మధ్యతరహా పరిశ్రమల ఫెడరేషన్‌కు అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా ఆయననూ శాలువాతో ఘనంగా సత్కరించి ఇరువురికి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య మనోహర్, శివరాజ్, డా. గోపాల్, అశోక్‌కుమార్, ప్రొఫెసర్ కె.వి. రమణమూర్తి, ఎన్.శివనాయక్, శివకోటి, డా. స్వప్నలతోపాటు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి దేవాలయలో వార్షికోత్సవ ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శిచుకుంటున్న దృశ్యం

సికింద్రాబాద్, అక్టోబర్ 31 ప్రభాతవార్తః నామాలగుండులోని శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో 48 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ట చేసి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గజమాల, తమలపాకుల మాల, వడమాల స్వామి వారికి వస్త్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ తాజా మాజి చైర్మన్ డి. చందర్, మాజీ చైర్మన్ కాచం రాము, చంద్రమౌళి, అర్చకులు ప్రణవ్ కుమార్, ప్రశాంత్, భాస్కరా చారి పాల్గొన్నారు.

చార్మినార్ భాగ్యలక్ష్మీ మందిరాన్ని సందర్శించిన జగద్గురు శంకరాచార్య విధుశేఖర్ భారతీ స్వామి

శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మ వారికి పూజలు నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య విధూ శేఖర్ భారతీ స్వామి

చార్మినార్, అక్టోబరు 31 ప్రభాతవార్త : శృంగేరి శారద మఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య విధూ శేఖర్ భారతీ స్వామి శుక్రవారం చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరాన్ని సందర్శించారు. మందిరం ట్రస్టీ శశికళ ఆలయ మర్యాదలతో శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య విధు శేఖర్ భారతీ స్వామికి స్వాగతం పలికి సత్కరించారు. మందిరంలో శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్ర మంలో చార్మినార్ భాగ్యలక్ష్మీ మందిరం కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

యాకుత్‌పుర, అక్టోబరు 31 ప్రభాతవార్త : విద్యుత్ మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అసద్‌బాబానగర్, కిషన్‌బాగ్, మహమూద్‌నగర్, కేశవ్‌నగర్, క్రిష్ణానగర్, శివానగర్‌మోర్‌సూపర్ మార్కెట్, గుమ్మా కొండా కాలనీ ప్రాంతాలలో, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటలు వరకు షరీఫ్ నగర్, మహమూద్ నగర్, ఎంఓ కాలనీ, అసద్ బాబానగర్, బహదూర్‌పుర, వాసు దేవి రెడ్డి నగర్, గోల్డెన్ ప్యాలెస్, వీకర్ సెక్షన్ కాలనీ, తేజస్వీ నగర్ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. అచ్చిరెడ్డినగర్, తీగలకుంట, బిబికాషమ్మా, మక్కాకాలనీ, రంజన్ కాలనీ, బషారత్‌నగర్, అలీబాగ్, తాడ్‌బన్, ఖాజా పహాడి, కాలీ కమాన్, కాలాఫత్తర్ పిఎస్, మోచి కాలనీ శనివారం 11 నుంచి 2 గంటలు వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు వెల్లడించారు.

సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద ఇందిరా గాంధీకి నివాళులర్పిస్తున్న బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు, వైస్ చైర్మన్ దేవుడు తదితరులు

బోయిన్‌పల్లిలో ఇందిరా గాంధీకి నివాళులర్పిస్తున్న జంపనప్రతాప్ తదితరులు

తుకారాంగేట్‌లో ఇందిరా గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు గంట రాజు సాగర్, కొమురమ్మ తదితరులు

ఇందిరాగాంధీ విగ్రహం వద్ద విజయారెడ్డి తదితరులు

ఇందిరా గాంధీ సేవలు మరువలేనివి

సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద ... కంటోన్మెంట్, అక్టోబర్ 31 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం 20 లక్షల సూత్రా పథకం, పంటల ఉత్పత్తి పెంచేందుకు, హరిత విప్లవం, బ్యాంక్‌లను జాతీయం చేసిన ఘనత తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీకే దక్కిందని బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆర్.ఆనంద్ బాబు, వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్‌లు తెలిపారు. ఇందిరా గాంధీ 41వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద ఉన్న ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి దేశానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు.

బోయిన్‌పల్లి పంప్‌హౌజ్ వద్ద .. భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దేశ ప్రజలకు చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని, ఆమె అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు పయనించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. ఇందిరా గాంధీ 41వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం బోయిన్‌పల్లి పంప్‌హౌజ్ వద్ద ఉన్న ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయిబాబా యాదవ్, యాదగిరి, సత్య నారాయణ, వాసు గౌడ్, పవన్, రాజు, కరన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్టలో అడ్డగుట్ట, అక్టోబర్ 31 ప్రభాతవార్త: భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం తుకారాంగేట్ లోని ఇందిరా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ డిసీసీ జిల్లా చైర్మన్ గంట రాజు సాగర్ ఇందిరా గాంధీ విగ్రహానికి నివాళులర్పించి దేశానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వై.కొమురమ్మ, జాఫర్, సుదర్శన్, క్రిష్ణ, లక్ష్మి యాదవ్, వరలక్ష్మి, యూషుఫ్, సంతోష్, భూపతి హరి, గౌతమ్, మంద ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ చౌరస్తాలో... జూబ్లీహిల్స్, అక్టోబరు 31, ప్రభాతవార్త: మాజీ ప్రధాని మంత్రి ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఖైరతాబాద్ నెక్లెస్ రోడ్‌లోని రోటరీ చౌరస్తా, ఐమాక్స్ థియేటర్ వద్ద ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం వద్ద శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించాయి. ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ పి. విజయారెడ్డి ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. ఇందిరాగాంధీ ఆశయాలను సాధిస్తామని ప్రతిన బూనారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

కార్మిక వర్గంపై అత్యంత దారుణమైన దాడులు : నరసింహ

హైదరాబాద్, అక్టోబరు 31 ప్రభాతవార్త కేంద్ర మోదీ ప్రభుత్వ పాలనలో కార్మిక వర్గంపై అత్యంత దారుణమైన దాడులు జరుగుతున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఏం.నరసింహ అన్నారు. ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్, గోల్నాక లేబర్ అడ్డా వద్ద ఏం. నరసింహ ఏఐటీయూసీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షత జరిగిన సభలో ఏం.నరసింహ మాట్లాడుతూ ప్రధాని మోదీ కార్మిక వ్యతరేక విధానాల వల్ల అభద్రతా ఉద్యోగాలు, సామాజిక భద్రత లేకపోవడం, దోపిడీ పని పరిస్థితులు, తక్కువ వేతనాలు మరియు యూనియన్ల విధ్వంసంతో కార్మికుల బ్రతుకులు ప్రమాదకరంగా మారుతున్నాయని చెప్పారు. కార్మికులు సంఘటితంగా కార్యచరణ రూపొందించుకొని పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశం మాట్లాడుతూ పోరాటాలు, త్యాగాలతో 105 సంవత్సరాలు పూర్తి చేసుకున్న దేశంలో మొట్టమొదటి జాతీయ ట్రేడ్ యూనియన్ ఏఐటీయూసీ అని గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి. వెంకటయ్య, ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్ఈ, హైదరాబాద్ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు చెట్టుకింద శ్రీనివాస్, గోల్నాక అడ్డా నాయకులు కాశయ్య, గాజుల శ్రీనివాస్, లింగస్వామి. ఎస్.నాగరాజ్, రాము, వి.రవి, భూషయ్య, శీను, శైలేష్, గణేష్, కే రవి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గోల్నాకలో ఏఐటియూసి జెండా ఆవిష్కరణ చేస్తున్న రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఏం.నరసింహ

దేశ ఐక్యతకు సర్దార్ వల్లాభాయ్ పటేల్ కృషి అమోఘం

- ఎంజిఐటి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి

నార్సింగి, అక్టోబర్ 31 ప్రభాతవార్త : భారతదేశ ఐక్యతకు సర్దార్ వల్లాభాయ్ పటేల్ చేసిన కృషి అమోఘమని, ఆయన ఆశయ సాధనకు నేటి యువతరం నడుం బిగించాల్సిన అవసరం ఉందని ఎంజిఐటి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గండిపేటలోని ఎంజిఐటి కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లాభాయ్ పటేల్ 150.వ, జయంతి వేడుకలను పురస్కరించుకొని "ఏక్తా రన్ ఫర్ యూనిటీ" ర్యాలీ నిర్వహించారు. ఈ వేడుకలను ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని 500.లకు పైగా సంస్థానాలను ఏకం చేసి, నేటి భారత దేశ చిత్రపటంగా మార్చారని వివరించారు. భారత దేశంలో కలిసేందుకు నిజాం సర్కారు నిరాకరించడంతో సైనిక చర్యకు దిగి హైదరాబాద్ సంస్థానంను భారతదేశంలో విలీనం చేశారని గుర్తు చేశారు. దేశంలో సంస్థానాల విలీనంతో పాటు రాజ్యాంగ రచనలో సైతం తనవంతు సహకారం అందించిన ఉక్కు మనిషి సర్దార్ పటేల్ అని గుర్తు చేశారు. బ్రిటీష్ పాలకుల కుయుక్తులతో దేశం ముక్కలు కాకుండా, దేశ సమైక్యత కోసం దృఢంగా నిలబడిన మహానేత సర్దార్ పటేల్ అని కొనియాడారు. వ్యక్తిగత, ప్రాంతీయ ప్రయోజనాల కంటే దేశ సమైక్యత, సమగ్రతే గొప్పవని చాటి చెప్పిన సర్దార్ పటేల్ దార్శనికత, అచంచలమైన దేశభక్తి మనకు ఎప్పుడూ స్ఫూర్తిదాయకమే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.బాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు 1000.మంది వరకు పాల్గొన్నారు.

గండిపేటలోని ఎంజిఐటి కళాశాల వద్ద "ఏక్తా రన్ ఫర్ యూనిటీ" ర్యాలీలో పాల్గొన్న ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి, విద్యార్థులు.

శేరిలింగంపల్లిలో బిఆర్ఎస్ జెండాను ఎగురవేస్తాం: బిఆర్ఎస్ నేతలు

శేరిలింగంపల్లి, అక్టోబర్ 31 ప్రభాతవార్త రాబోయే ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురటం ఖాయమని, మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి చేరికతో పార్టీ బలోపేతమవతుందని శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నేతలు అభిప్రాయపడ్డారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని చందానగర్ విద్యానగర్ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ నియోజక వర్గ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. నవంబర్ 2వ తేదిన చందానగర్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు సంఘీభావం తెలిపారు. నవతారెడ్డి బీఆర్ఎస్‌లో చేరటంతో పార్టీ బలోపేతమవుతుందని పార్టీ నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి మాట్లాడుతూ.. నవంబర్ 2వ తేదిన ఉదయం 11 గంటలకు బీఆర్ఎస్ భవన్‌లో కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరటం జరుగుతుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సామ వెంకటరెడ్డి, కోమండ్ల శ్రీనివాస్ రెడ్డి, మల్లిఖార్జునశర్మ, పురుషోత్తం యాదవ్, పారునంది శ్రీకాంత్; మల్లారెడ్డి, సంగారెడ్డి, శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, ప్రకాశ్, రాజన్న, రమేశ్; రామకృష్ణగౌడ్, అల్లావుద్దీన్, శ్రీనివాస్‌గౌడ్, భిక్షపతి, సలీం, గౌస్, చందర్‌రావు, అనంతరెడ్డి, సంతోశ్, ప్రమోద్, గిరి, అప్సర్, చిన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

చందానగర్‌లో బీఆర్ఎస్ నేతలు, ఉద్యమకారులతో సమావేశమైన మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి

మానవతా పతాకం ఆరిగపూడి విజయకుమార్ : పద్మశ్రీ కొలకలూరి ఇనాక్

చిక్కడపల్లి అక్టోబర్ 31 (ప్రభాతవార్త): కళా సాహిత్య సేవా రంగాలకు అనితరసాధ్యమైన సేవలు చేసిన స్వర్గీయ లయన్ డా.ఎ. విజయకుమార్ మానవతా పతాకమని పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ అభివర్ణించారు. భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ కవి డా.బిక్కికృష్ణ అధ్యక్షతన స్వర్గీయ లయన్ ఆరిగపూడి విజయకుమార్ జన్మదినవేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. తల్లిదండ్రులు ఆరిగపూడి పూర్ణచంద్రరావు, నాంచారమ్మల ప్రేరణతో డా.విజయకుమార్ చిన్ననాడే దాతృత్వగుణాన్ని పెంపొందించుకొని కోట్లాది రూపాయలు దానం చేయడం ఆయన మానవత్వానికి, సేవా తత్వానికి పరాకాష్టగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ పేర్కొన్నారు. ఈసందర్భంగా కొలకలూరి ఇనాక్ రాసి, విజయకుమార్ కు అంకితమిచ్చిన "చలన సూత్రం" గ్రంథాన్ని, బి.ఎస్.రాములపై వచ్చిన మరో గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు డా.పి. విజయలక్ష్మి పండిట్, డా.జెల్ది విద్యాధర్, శ్రీరాం దత్తు, గాయకుడు రామకృష్ణ, దర్శకుడు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

'చలన సూత్రం" గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్

ఐపాస్ నగర ప్రధాన కార్యదర్శి రామరాజు కన్నుమూత

చిక్కడపల్లి అక్టోబర్ 31 (ప్రభాతవార్త) ఆల్ ఇండియా పీస్ అండ్ సాలిడారిటీ ఆర్గనైజేషన్ నగర ప్రధాన కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర నేత ఏ ఆర్.దేవరాజ్ తనయుడు ఏ.రామరాజు శుక్రవారం తెల్లారుజామున అశోక్ నగర్ లోని ఆయన నివాసంలో గుండెపోటుతో మరణించారు. కేంద్ర ఉద్యోగ సంఘం నేతగా, ఏఐఎస్ఎఫ్ పూర్వ నేతగా రామరాజు విశేషంగా సేవలందించారు. రామరాజు మృతి తెలుసుకున్న రామరాజు సమీప బంధువు, జి హెచ్ ఎం సి జాయింట్ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, సిపిఐ నగర నేత వెంకటస్వామి గౌడ్, బ్యాంక్ ఉద్యోగులు రమేష్, వినోద్, ప్రేమ్ కుమార్, రమేష్ కుమార్ లు ఆయన మృతి దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన అంత్యక్రియలు దోమలగూడ శ్మశానవాటికలో జరిగాయి.

శుక్రవారం నగరంలో రిటైర్డ్ ఐఎఎస్ అధికారి బిపి ఆచార్య వెలువరించిన అబ్బాస్ యాంగిల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ. సర్దార్‌పటేల్ 150వ జయంతి సందర్భంగా జరిగిన ఈకార్యక్రమంలో ఫిక్కీ ఆడిటోరియంలో బండారు వైష్ణవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత, సివిల్ సర్వీసెస్ సేవలు అన్న అంశంపై చర్చాగోష్ఠిని కూడా నిర్వహించారు.

అంగరంగ వైభవంగా శ్రీగిరి వెంకన్న ఆలయ పునఃప్రారంభం

-వెల్లివిరిసిన ఆధ్యాత్మిక భక్తిభావం

-ముగ్గురు పీఠాధిపతుల అనుగ్రహభాషణం

-స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

సికింద్రాబాద్, అక్టోబర్ 31 ప్రభాతవార్తః సికింద్రాబాద్ శ్రీనివాసనగర్‌లోని శ్రీగిరి పద్మావతి గోదా సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ పునఃప్రారంభం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ముగ్గురు పీఠాధిపతుల నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేసి జీర్ణోద్ధరణ పూర్వక మహాసంప్రోక్షణ మహా కుంభాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు మూడేళ్ల తర్వాత ప్రసన్న వెంకన్నస్వామి మూలవిరాట్‌ను దర్శించుకుని భక్తిపారవశ్యంతో ఆధ్యాత్మిక అనుభూతి పొందారు. కంచి కామ కోటి శంకరాచార్య శ్రీశంకర విజయేంద్ర సరస్వతి, పుష్పగిరి మహాసంస్థాన పీఠాధీశ్వరులు అభినవోద్దండ విద్యాశంకర భారతి, శ్రీమదష్టాక్షరీ పీఠాధీశ్వరులు త్రిదండి అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజ జీయరు స్వామిలు ముఖ్యఅతిథులుగా హాజరై జీర్ణోద్ధరణ సంప్రోక్షణ మహాకుంభాభిషేకం నిర్వహించి, నూతనంగా నిర్మించిన ఆలయాల్లో స్వామివార్ల మూలవిరాట్‌లను ప్రతిష్టించి ప్రత్యేక పూజలతోపాటు భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ప్రజల్లో భక్తిభావం మరింత పెంపొందించేందుకు తరుచు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నిర్మలమైన మనసుతో స్వామివారిని దర్శించుకుంటే అంతా మంచే జరుగుతుందని ఉద్బోధించారు. ఆగమశాస్త్ర పద్ధతిలో ఆలయాన్ని నిర్మించి, ఆధ్యాత్మికశోభను నలుదిశలా విస్తరింపజేసిన ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులను అభినందించారు. శుక్రవారం సాయంత్రం వేద పండితుల నేతృత్వంలో శాంతికళ్యాణం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు శ్రీగిరి ప్రసన్న వెంకన్నస్వామి ఆలయాన్ని పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి దుద్దిల శ్రీధరబాబు, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యార్, దేవదాయశాఖ కమిషనర్ హరీష్, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్, దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆధ్యాత్మికవేత్తలు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పెద్దసంఖ్యలో హాజరై జీర్ణోద్ధరణ పూర్వక కుంభాభిషేకం, ఆలయ పునఃప్రారంభ కార్యక్రమాలను విజయవంతం చేసిన పీఠాధిపతులు, మంత్రులు, ఆధ్యాత్మికవేత్తలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారులకు ఆలయ ఈఓ కడకండ్ల రాజేష్‌కుమార్, కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, తమ్మన వేణుగోపాలరావులు కృతజ్ఞతలు తెలిపారు. పునర్నిర్మాణ కమిటి ప్రతినిధులు బాలభాస్కర్, ఆత్మరామ సూర్యసుబ్రహ్మణ్యం, శివశంకరన్, నారాయణన్, సుజయ్‌ప్రకాశ్, శ్రీహరి, షన్ముఖ రావు, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

అనుగ్రహభాషణం చేసున్న కంచికామకోటి పీఠాధిపతి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న శ్రీశంకర విజయేంద్ర సరస్వతి

గీతా జయంతిని పురస్కరించుకుని శ్రీమద్భగవద్గీత కంఠస్థ పోటీలు

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రమేష్‌కుమార్, హరినాథ్

సైఫాబాద్, అక్టోబరు 31 ప్రభాతవార్త: గీతా జయంతిని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానములు (టిటిడి), హిందూ ధర్మప్రచార పరిషద్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని వివిధ దేవాలయాల్లో విద్యార్థులకు 'శ్రీమద్భగవద్గీత కంఠస్థ పోటీలను నిర్వహిస్తున్నామని టిటిడి ఎఇఓ యు.రమేష్‌కుమార్, ప్రోగ్రాం కన్వీనర్ హరినాథ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని టిటిడి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి వారు మాట్లాడారు. నవంబరు 22వ తేదీన మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం, కుత్బుల్లాపూర్‌లోనూ, 26వ తేదీన వికారాబాద్ జిల్లా శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, 28న హిమాయత్ నగర్‌లోని టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో పోటీలు జరుగుతాయన్నారు. అలాగే నవంబరు 29న రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ స్కూల్‌లో పోటీలు ఉంటాయని, ఇతర వివరాలకు 9030850336లో సంప్రదించాలని వారు కోరారు.

ఆటో డ్రైవర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

నేటి నుంచి సెంటనరీ బాప్టిస్ట్ చర్చి వార్షికోత్సవ వేడుకలు

సికింద్రాబాద్ సెంటనరీ బాప్టిస్ట్ చర్చి 150వ వార్షికోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చర్చి ఫాదర్లు

కంటోన్మెంట్,అక్టోబర్ 31 ప్రభాతవార్త: సికింద్రాబాద్ క్లాక్ టవర్ సమీపంలోని సెంటనరీ బాప్టిస్ట్ చర్చి 150వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఈ నెల 1 శనివారం నుంచి 22వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్టాండింగ్ కమిటీ,జూబ్లీ స్టీరింగ్ కమిటీ చైర్మన్ రాబర్ట్ సూర్యనప్రకాశ్ తెలిపారు. శుక్రవారం చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1875లో హైదరాబాద్ ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఆమెరికా బాప్టిస్ట్ మిషన్‌కు చెందిన రెవరెండ్ డబ్ల్యు, డబ్ల్యు క్యాంప్ బెల్ సతీమణి లీడియా చర్చిని స్థాపించినట్లు తెలిపారు. నాటి నుంచి నేటికి 6 వేల సభ్యులతో పాటు తెలంగాణలో 65 శాఖలుగా విస్తరించిందన్నారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా 22 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 14వ తేదీన గవర్నర్ విష్ణుదేవ్ వర్మ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి సీనియర్ ఫాస్టర్ డాక్టర్ ఎం.పురుషోత్తం, అధ్యక్షులు సందీప్, క్యాలిస్టర్, చార్లెస్, సత్య రాజన్, వంగూరి ఎలియా, ఎలిష, యేసు దాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసంగమేశ్వరాలయంలో నేత్రపర్వంగా కార్తీకమాస మహోత్సవాలు

నాంపల్లి, అక్టోబరు 31 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో గాంధీ నగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న అతిపురాతన శైవక్షేత్రం శ్రీసంగమేశ్వర, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో నవంబర్ 20 నుండి కార్తీకమాస మహోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. ప్రత్యే పూజా కార్యక్రమాల్లో 26 ఆదివారం విభూత్యాభిషేకం; 27 మొదటి కార్తీక సోమవారం మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేం, ఏకవార రుద్రాభిషేకములు భక్తజన సందోహం మధ్య కన్నులపండువగా జరిగాయి. రేపు నవంబరు 1 శనివారం ఉదయం 9.30లకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతము నిర్వహించనున్నట్లు అర్చకస్వాములు ఎం.చంద్రశేఖర్‌శర్మ, ప్రవీణ్‌కుమార్, మురళీ కృష్ణమాచారి తెలిపారు. అలాగే 2 ఆదివారం ఉదయం 9.30లకు శతచ్ఛిద్ర రుద్రాభిషేకము; రాత్రి 6.30లకు తులసీ కళ్యాణం, అల్పాహారం; 3 సోమవారం ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేం, ఉదయం 7.30-10.30-12లకు, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాభిషేకములు; 5 బుధవారం కార్తీకపౌర్ణమి ఉదయం 4లకు మహాన్యాస పూర్వక ఏకదశవార రుద్రాభిషేం,7.30- 9-10.30-12లకు ఏకవార రుద్రాభిషేకములు,రాత్రి7 జ్వాలాతోరణం,పుష్పాలంకరణలు ఉంటాయని,అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీసంగమేశ్వరస్వామివారి కృపకు పాత్రులు కావాలని సూచించారు.

సిసిరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

పనులు ప్రారంభిస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

దుండిగల్, అక్టోబర్ 31 ప్రభాతవార్త: దుండిగల్ పురపాలిక పరిధి మల్లంపేట్ కెవిఆర్‌వ్యాలీలో నూతనంగా నిర్మిస్తున్న సిసిరోడ్డు పనులను నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితంగా పూర్తి చేయాలని సూచించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈమేరకు కాలనీవాసులు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పద్మారావు, మనోజ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, గురువారెడ్డి, సురేష్‌చంద్ర, ధర్మారావు, శ్రీదేవి, రమాదేవి, జ్యోతి, విజయ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

2కె రన్‌ను ప్రారంభించిన డిసిపి రష్మి పెరుమాల్

సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్ నుంచి రన్‌ను ప్రారంభిస్తున్న డిసిపి రష్మి పెరుమాల్ తదితరులు

కంటోన్మెంట్,అక్టోబర్ 31 ప్రభాతవార్త: భారత తొలి ఉప ప్రధాని, భారత రత్న,హక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి, పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ నుంచి జెబిఎస్ సమీపంలోని పికెట్ గార్డెన్ వరకు నిర్వహించిన 2కె రన్‌ను ఉత్తర మండలం డిసిపి సాధన రష్మి పెరుమాల్ ప్రారంభించారు.కార్యక్రమంలో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నేహ్వాల్,మాజీ క్రికెటర్ వెంకటపతి రాజులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలను పర్యవేక్షించిన బానుక నర్మద

ట్రాఫిక్ ఆంక్షలను పర్యవేక్షిస్తున్న బానుక నర్మద తదితరులు

కంటోన్మెంట్,అక్టోబర్ 31 ప్రభాతవార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా ట్రాఫిక్ సమస్యలపై, దారి మళ్లింపులపై శుక్రవారం కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే, ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజులతో సమావేశమైయ్యారు. సందర్భంగా ప్యారడైజ్ సమీపంలోని బాలంరాయి చౌరస్తా మీదుగా వెళ్తున్న ట్రాఫిక్ సమస్యలను ఆమె పర్యవేక్షించారు. బోర్డు సిఈఓ బంగ్లా నుంచి ప్యారడైజ్ వరకు వన్ వేగా మార్చడం వలన వాహన దారులకు కొంత ఉపసమనం కలుగుతుందని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

ప్రెస్‌క్లబ్‌ను ఫ్యామిలీ క్లబ్‌గా మార్చుతామని హామీ

బాధ్యతలు స్వీకరించిన నూతన కమిటీ చిత్రంలో విజయ్‌కుమార్‌రెడ్డి, రమేష్, రాజేష్, బాబురావు,హరిప్రసాద్ తదితరులు

హైదరాబాద్, అక్టోబర్, 31,ప్రభాతవార్త: హైదరాబాద్ ప్రెస్ క్లబ్ 2025-2027 సంవత్సరాలకుగానూ నూతన కార్యవర్గం నిరాడంబరంగా బాధ్యతలు చేపట్టింది. గత ఆదివారం జరిగిన ఎన్నికలలో ఫ్రెండ్స్ ప్యానల్ ఘన విజయం సాధించింది. ఈసందర్భంగా శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి, రమేష్ వరికుప్పల,ఉపాధ్యక్షులుగా అరుణ అత్తలూరి, ఏ .రాజేష్, జాయింట్ సెక్రటరీలుగా చిలుకూరి హరి ప్రసాద్, బాబురావు, ట్రెజరర్ గా రమేష్ వైట్ల బాధ్యతలు చేపట్టారు. అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్ .ఉమాదేవి, మర్యాద రమాదేవి, కళ్యాణం రాజేశ్వరి ,శంకర్, కస్తూరి శ్రీనివాస్, నాగరాజు శ్రీనివాస్ రెడ్డి, రచన, అశోక్ దయ్యాల, సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు, అమిత్ బాధ్యతలు స్వీకరించారు. ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ సీనియర్ పాత్రికేయులు దేవులపల్లి అమర్ సమక్షంలో పాత పాలకమండలి మినిట్స్ బుక్ ను నూతన కార్యవర్గానికి అందజేసింది. ఎన్నికలకు రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి సహాయ కార్యదర్శి కొండ శ్రీనివాసులు నూతనంగా ఎన్నికైన పాలకమండలి సభ్యులకు ఎన్నికైనసర్టిఫికెట్లను ప్రధానం చేశారు. తెలుగు రాష్ట్రాలలో ప్రతిష్టాత్మక క్లబ్ గా పేరున హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ను మరింత అభివృద్ధి చేయడంతో పాటు క్లబ్ సభ్యుల సంక్షేమం కోసం పని చేయాలని నూతన పాలకమండలికి సీనియర్ పాత్రికేయులు సూచించారు. తమపై ఎంత విశ్వాసంతో ఓటు వేసి గెలిపించిన సభ్యుల నమ్మకాన్ని వొమ్ము చేయకుండా పనిచేస్తామని నూతన పాలకమండలి ప్రకటించింది. ఎన్నికల వరకే వేరువేరు ప్యానల్స్ అని ఎన్నికలు ఎన్నికలు ముగిశాక పోటీ చేసిన వారందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని తెలిపింది. ప్రెస్ క్లబ్ పూర్వ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్. వేణుగోపాల్ నాయుడు ఆర్ రవికాంత్ రెడ్డిలు తమ బాధ్యతలను కొత్త కమిటీకి అప్పగించారు. ఆరు దశాబ్దాల చరిత్ర గల ప్రెస్ క్లబ్ ను ఫ్యామిలీ క్లబ్ గా మార్చడంతో పాటు సభ్యులకు ఇచ్చిన హామీలన్నింటిని నిలుపుకుంటామని నూతన పాలకమండలి ఈ సందర్భంగా హామీ ఇచ్చింది. నవంబర్‌లో ఫ్యామిలీ గెట్ టుగెదర్ నిర్వహించడంతోపాటు వివిధ నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, రాష్ట్రబీసీ బిసి కమిషన్ సభ్యులు సురేందర్, రెహమాన్, సీనియర్ పాత్రికేయులు, సీజీకే మూర్తి, బి కిరణ్ హాజరయ్యారు.

ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ, విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమం

ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలను సందర్శిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ కే.శిల్పవల్లి

ముషీరాబాద్, అక్టోబర్ 31, ప్రభాతవార్త: కమ్యూనిటీ పోలీసింగ్ మరియు విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాలలో భాగంగా ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెంట్రల్ జోన్ డీసీపీ కే.శిల్పవల్లి పలు ప్రాంతాలను సందర్శించారు. గురువారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీసీపీ బృందం భోలక్‌పూర్, బోయిగూడ ప్రాంతాలలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి, అక్కడ స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నేను సైతం సీసీటీవీ కెమెరాల పనితీరును పరిశీలించటంతో పాటు, వాణిజ్య స్థాపనల్లో భద్రతా చరనయలను తనిఖీ చేశారు. అదేవిధంగా రౌడీ షీటర్ల వివరాలను సేకరించి, ప్రస్తుత వారి కార్యకలాపాలను సమీక్షించారు. బ్లూకోల్ట్స్ పెట్రోల్ కార్ సిబ్బంది మరియు సెక్టార్ ఎస్ఐలు క్రమం తప్పకుండా వస్తున్నారా లేదా అనే అంశాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను స్వీకరించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అపార్ట్‌మెంట్లను సందర్శించిన డీసీపీ అపార్ట్‌మెంట్‌లలో తీసుకోవలసిన భద్రతా చర్యలపై సూచనలు చేశారు. హైదరాబాద్ నగర పోలీస్ కమీషనర్ వి.సీ.సజ్జనార్ ఆదేశాల మేరకు సెంట్రల్ జోన్లఓని అధికారులు విజిబుల్ పోలీసింగ్ మరియు కమ్యూనిటీ అవుట్‌రిచ్ కార్యక్రమాలను బలోపేతం చేయటానికి ప్రజలతో నేరుగా కలసి మాట్లాడటం, వాట్సాప్ కమ్యూనిటీ గ్రూప్‌ల ద్వారా సమన్వయం పెంచుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ ఆనంద్, చిక్కడపల్లి ఏసీపీ రమేష్, ముషీరాబాద్ ఎస్‌హెచ్‌ఓ రాంబాబు, డీఐ నదీం మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న పీఠాధిపతి విధుశేఖర భారతీ స్వామి



మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారదా శంకర మఠంలో ధర్మ విజయ యాత్రలో భాగంగా పూజలు నిర్వహిస్తున్న జగద్గురు పీఠాధిపతి విధుశేఖరా భారతీ స్వామి.

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 31, ప్రభాతవార్త : మోతీనగర్ ప్రాంతంలోని శ్రీ శృంగేరి శంకరామఠంకు ధర్మ విజయ యాత్రలో భాగంగా శుక్రవారం జగద్గురు పీఠాధిపతి విధు శేఖర భారతీస్వామి విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు కోలాటంతో చిన్నారులు సాంస్కృతిక నృత్యాలు చేస్తూ స్వామి వారికి ఘన స్వాగతం పలికారు అదేవిధంగా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన విధంగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. స్వామి వారికి పూర్ణకుంభంతో స్వాగతించారు. ఆలయ ధర్మాధికారి సీఎస్ఆర్ మూర్తి స్వాగతం పలికారు. మందిరంలో జగద్గురు చరణములకు దూలిపాద పూజ, అనుగ్రభూషణం, దివ్యదర్శనం, గురుపాదుక పూజా నిర్వహించారు. చంద్ర మౌలిశ్వర మూల వీరాట్‌లకు విశేష అభిషేకం ఆలయ శిఖరంకు కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం పిల్లలచే భగవద్గీత స్లోకాల పారాయణం, మహిళా భక్తులచే సూత్రపారాయణం చేశారు. నవంబర్ 1 శనివారం జగద్గురు దివ్యదర్శనం భిక్షావందనం ఉంటుందని ఆలయ ధర్మాధికారి సీఎస్ఆర్ మూర్తి పేర్కొన్నారు.

హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షునిగా నియామక పత్రాన్ని అందుకుంటున్న కొలన్ సత్యనారాయణ.

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 31, ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం భారతీయ జనతాపార్టీ హైదరాబాద్ సెంట్రలల్ జిల్లా ఉపాధ్యక్షునిగా రహమత్‌నగర్ డివిజన్‌కు చెందిన కొలన్ సత్యనారయణను నియమించగా అందుకు సంబంధించిన నియామక పత్రాన్ని కేంద్రమంత్రి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా కొలన్ సత్యనారాయణ మాట్లాడుతూ తాను మొదటి నుంచి కూడా బీజేపీ పార్టీలో చురుకైన కార్యకర్తగా పార్టీ ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తూ అన్ని వేళల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ అనేక పదవులను నిర్వహించటం జరిగిందని పార్టీ ఆదేశానుసారం తన పనితనాన్ని గుర్తించి తనకు ఈ అవకాశం ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో తాను బీజేపీ పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్, అక్టోబర్ 31, ప్రభాతవార్త

నేడు ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 02:00 వరకు 11 కెవి నిజాంపేట్, ఎస్ఎంఎస్, ఎస్ఎల్జి, మా విల్లాలు, వెంకట్ ప్రణీత్, తరణ్ భాస్వానీ ఫీడర్లులోని ఇందిరా నగర్, కాకతీయ నగర్, బాచుపల్లి జిపి, షికారా విల్లాలు, ఎస్సి కాలనీ, బొల్లారం ఇండస్ట్ ఏరియా, సాయి నగర్ కాలనీ, ఆదిత్య గార్డెన్స్, ప్రణీత్ అపార్ట్‌మెంట్స్, తరణ్ భాస్వానీ అపార్ట్‌మెంట్స్, మా విల్లాలు, కౌసల్య కాలనీ, వికాస్ ప్రాంతాలలో విదునయత్ సరఫరా ఉండదని బాచుపల్లి ఏఈ శుక్రవారం ప్రకటలో తెలిపారు.

కార్మిక రాజ్యం ఎర్ర జెండాతోనే సాధ్యం

-ఎఐటియూసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్

జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

నిజాంపేట్, అక్టోబర్ 31, ప్రభాతవార్త

ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిజాంపేట్ వార్డు కార్యక్రమం వద్ద అలాగే నిజాంపేట్ డంపింగ్ యార్డ్ దగ్గర ఆశి. యాదయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏఐటీయూసీ ఏర్పడి 106వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్నామని, ఎంతో మంది త్యాగల, అమరుల వల్ల ఈ కార్మికుల చట్టాలు, హక్కులు అనుభవిస్తున్నామని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ హక్కులు కాపాడుకునే పరిస్థితి వచ్చిందన్నారు. కార్మిక రాజ్యం సాధించాలనంటే కేవలం మన ఎర్ర జెండా ఏఐటీయూసీ తోనే సాధ్యమని, కార్మిక రాజ్య స్థాపనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో భాగ్యమ్మ, నర్సమ్మ, పొన్నికంటి దస్తగిరి, మోహన్ రెడ్డి, పరమేష్ గౌడ్, తిమన్న, సాయి, కృష్ణ, రామకృష్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రింగు రామ్మూర్తి పదవీ విరమణ

రింగు రామ్మూర్తి దంపతులు

నిజాంపేట్, అక్టోబర్ 31, ప్రభాతవార్త

సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ సేవా విభాగంలో సహాయ సంచాలకులు రింగు రామ్మూర్తి పదవీ విరమణ చేశారు. శుక్రవారం విశ్వవిద్యాలయం కళామందిరంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య వెల్దండ నిత్యానందరావు జ్ఞాపిక, శాలువాతో పాటు పదవీ విరమణ ఆర్థిక ప్రయోజనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహితీ జగత్తులో రామ్మూర్తి చిరపరిచితులని, వారి ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం ప్రదానం చేసే వేలాది పురస్కారాల ఎంపికలో కీలక బాధ్యతలను స్వీకరించేవారని గుర్తుచేశారు. ఆచార్య కోట్ల హనుమంతరావు మాట్లాడుతూ రింగు రామ్మూర్తి విశ్వవిద్యాలయ కీర్తి ప్రతిష్టలను పెంచారని, వారు నిర్వహించిన వేలాది కార్యక్రమాలు సాహితీ, సాంస్కృతిక వికాసానికి దోహదపడ్డాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం పూర్వ ప్రజా సంబంధాల అధికారి డా.జె.చెన్నయ్య, డా.రెడ్డి శ్యామల, డా.పద్మప్రియ, రాధ, శ్రీనివాస్ గౌడ్, డా.వనజ, వెంకటేశం, కెపిఅశోక్ కుమార్, కె.శ్రీరాములు, సి.మహేందర్, డా. నాలేశ్వరం శంకర్ పాల్గొన్నారు.

హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభమైన కామిక్స్, గేమింగ్‌లో పాల్గొన్న గేమర్స్

వచ్చే అసెంబ్లీ సమావేశాల నుంచి విద్యా హక్కు చట్టం అమలు చేయాలి

బహుజన ప్రజా శక్తి (ఉద్యమ వేదిక) డిమాండ్

విద్య హక్కు చట్టాన్ని అమలు చేయలని నినాదాలు చేస్తున్న బహుజన ప్రజా శక్తి నాయకులు

సైఫాబాద్, అక్టోబరు 31 ప్రభాతవార్త: వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని బహుజన ప్రజా శక్తి (ఉద్యమ వేదిక) రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్, హైదరాబాద్ నగర ఇంచార్జ్ ప్రకాష్ డిమాండ్ చేశారు. 6 నుంచి 14 సంవత్సరాల లోపు విద్యార్థులకు ఉచిత నిర్బంధ విద్య అమలుకు 2009లో విద్యా హక్కు చట్టం వచ్చిందని, కాని నేటి వరకు అమలు లేకపోవడం వల్ల లక్షలాది మంది విద్యార్థులు నష్టపోతున్నారని, దీనిని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, పిజి కళాశాలల సంఖ్య పెంచాలని, ప్రైవేటు విద్యా సంస్థల్లో అధిక ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలని, పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజుల రీయంబర్స్‌మెంట్ తక్షణమే చెల్లించాలని, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, వీటి సంఖ్యను పెంచాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యకు 25 శాతం నిధులు కేటాయించాలని, అతి తక్కువగా నిధులు కేటాయించడం ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి మండల కేంద్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో మోడల్ గురుకుల పాఠశాలలను నిర్మిస్తామని ప్రకటించిందని, అధికారంలోకి వచ్చి 23 నెలలు గడుస్తున్నప్పుటికి ఊసు ఎత్తకపోవడం దారుణమని, కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్యను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రజా శక్తి రాష్ట్ర ప్రతినిధులు మల్లేష్, విష్ణుకుమార్, పి.నర్సింగ్‌రావు, ఎర్ర నాగయ్య, నగేష్, ఎన్.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

15,16 తేదీల్లో "ఆలిండియా కరాటే ఛాంపియన్‌షిప్"

పోస్టర్ ఆవిష్కరించిన సినీ హీరో సుమన్

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సుమన్, గణేష్ తదితరులు

హైదరాబాద్, అక్టోబరు 31,ప్రభాతవార్త: శారీరక, మానసిక దృఢత్వంపాటు ఓర్పు, సహనం చేకూర్చేందుకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో దోహదం చేస్తుందని సినీ హీరో సుమన్ అన్నారు. ఎన్నిసార్లు ఓడినా కుంగిపోవద్దని, విజయంసాదించేవరకు శ్రమించాలని సూచించారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కరాటే ఫెడరేషన్ అఫ్ షోటకాన్ ఇండియా అధ్యక్షులు గడియారం గణేశ్ అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. దీనికి సుమన్ ముఖ్యులు తిరిగా విచ్చేసి, నవంబర్ 15,16 తేదీల్లో సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగే ప్రెసిడెంట్ కప్ ఆలిండియా ఒపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ 2025 బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల ఆత్మరక్షణకు కరాటే నేర్పించాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. దీన్ద్వారా వారికి శరీరం ఒక ఆయుధంగా మారుతుందన్నారు. జాతీయస్థాయిలో జరిగే ప్రెసిడెంట్ కప్ కు అందరూ కరాటే మాస్టర్లు హాజరుకావాలని సూచించారు. గణేశ్ మాట్లాడుతూ ప్రెసిడెంట్ కప్ కార్యక్రమానికి ముఖ్య అతిథులు టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి హీరో సుమన్ హాజరవుతారని తెలిపారు. ప్రెసిడెంట్ కప్ విజేతలకు బంగారు, వెండి పతకాలు. రూ.10వేల చొప్పున నగదు బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి

అత్తాపూర్ అక్టోబరు31, ప్రభాతవార్త : సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి కార్యక్రమాన్ని హైదర్‌గూడలోని పటేల్ చౌరస్తాలో నారగూడెం మల్లారెడ్డి కన్వీనర్ సర్దార్ పటేల్ ఉత్సవ కమిటీ రంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ ,మైలార్‌దేవులపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొని పటేల్ విగ్రహానికి పూలమాల నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వతంత్ర సమరయోధుడు ఉక్కుమనిషి, రైతు ఉద్యమకారుడు, మొదటి ఉప ప్రధాని హోంశాఖ మాత్యులు 560 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసిన ఘనత వారికే దక్కింది అని నైజాం మెడలు వంచి హైదరాబాద్ సంస్థనన్ని భారతదేశంలో విలీనం చేసిన ఘనత వారికే దక్కిందని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ శివరాంపల్లిలో స్థాపించి దేశానికి ఐపీఎస్ అధికారులను అందించే సంస్థ మన దగ్గరనే ఉండడం గర్వకారణమని పటేల్ యొక్క ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొమురయ్య ,అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కడెం సుధాకర్ జిల్లా కౌన్సిల్ మెంబర్ విజయకుమార్ జిల్లా అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్ ప్రణవభక్త సమాజం అధ్యక్షులు నరసింహ బి మల్లారెడ్డి జయనాథ్ రెడ్డి ఎన్ రమేష్ జి రాజు వెంకట్ రెడ్డి వాసు ఎం జగన్ వనిత రెడ్డి ఉమ సరిత గాయత్రి అనిల్ మణికంట శ్రీకాంత్ చారి సాయి యాదవ్ నరేష్ లక్ష్మీకాంత్ రెడ్డి సతీష్ శ్రీనివాస్ సహదేవ్ రెడ్డి వినయ్ రెడ్డి పాండు యాదవ్ రవీందర్ రెడ్డి అమన్ రవి సుధాకర్ రెడ్డి వరద రాజ్ రెడ్డి రాములు ప్రవీణ్ ముకేష్ లకన్ బాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గోల్ఫ్ అండ్ టర్ఫ్ సమ్మిట్

బస్తీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : కార్పొరేటర్

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

సైదాబాద్, అక్టోబరు 31 ప్రభాతవార్త: ఐఎస్ సదన్ డివిజన్‌లోని బస్తీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి అన్నారు. సింగరేణి కాలనీలో సిసి రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని బస్తీలలో రోడ్లు, త్రాగునీరు, యుజిడి, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి కనీస సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ నాయక్, దశరథ్, హరి, నర్సింహా, మున్నా, లక్ష్మి, చిట్టి, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగం సవాళ్లతో కూడుకున్నది

రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు

నేరేడ్‌మెట్,రాచకొండ కమిషనరేట్, అక్టోబర్ 31:ప్రభాతవార్త. రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన ఐదుగురు సబ్ ఇన్స్పెక్టర్లను కమిషనర్ సుధీర్‌బాబు ఘనంగా సన్మానించారు. రాచకొండ పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిపాల్‌రెడ్డి, పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చెందిన రవీంద్రరెడ్డి, లాలయ్య, హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన రాజేశ్వర్, యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌కు చెందిన ఆనంద్‌నాయక్‌లను సన్మానించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం సవాళ్లతో నిండినదని, క్రమశిక్షణతో దీర్ఘకాలం పాటు ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేసినందుకు పదవీ విరమణ పొందిన అధికారులను అభినందించారు. విధి నిర్వర్తనలో ఎదురయ్యే ఒడిదుడుకులను అధిగమిస్తూ ప్రజల భద్రత కోసం చేసిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ప్రశాంతంగా, ఆరోగ్యంగా జీవించాలని, పెన్షన్ సంబంధిత అంశాలలో క్రమబద్ధత పాటించాలని సలహా ఇచ్చారు. వారికి రావలసిన ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు పోలీసు అధికారి ఇందిర, ఉప కమిషనర్ శివకుమార్, వృత్తి నేర పరిశీలన విభాగ అధికారి రమేష్, పరిపాలన అధికారి పుష్పరాజ్, సహాయక అధికారి అశోక్‌రెడ్డి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు భద్రారెడ్డి, సహకార విభాగ అధికారి సువర్ణ తదితరులు పాల్గొన్నారు

ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

: డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు రాజేశ్వర్ రెడ్డి

మలక్ పేట ,అక్టోబర్ 31 ప్రభాతవార్త: ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ప్రముఖ విద్యావేత్త, తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆర్. రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్, బోరబండ ఎన్నికల ఇన్చార్జ్ మల్లు రవి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి అభ్యున్నతి కోసం పాటుపడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్ర మంలో పిసిసి మాజీ కార్యదర్శి బొమ్మ హనుమంతరావు, నాయకులు బాబా ఫసియుద్దీన్, పలువురు నాయకులు,పాల్గొన్నారు.

వనస్థలిపురం పోలీసుల ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ

రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు.

వనస్థలిపురం. అక్టోబరు.31.ప్రభాతవార్త. రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి సందర్భంగా అక్టోబర్ 31.రాష్ట్రీయ ఏక్తా దివాస్ లో భాగంగా వనస్థలిపురం పోలీసులు రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, కాలనీవాసులు,వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. వనస్థలిపురం వివేకానంద పార్క్ నుండి గణేష్ టెంపుల్,లోటస్ లాప్ స్కూల్,పోస్ట్ ఆఫీసు, రెడ్ వాటర్ ట్యాంక్ మీదుగా రన్ చేస్తూ తిరిగి వివేకానంద పార్క్ కు చేరుకున్నారు.ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఇన్స్పెక్టర్ టి. మహేష్ గౌడ్, రాజేష్,నాగచారి,ఎస్.ఐ. లు గిరీష్ కుమార్,అనిల్,రవి నాయక్,గౌతమ్ సిబ్బంది పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో ...

కార్యక్రమంలో పాల్గొన్న ఎసిపి, సిబ్బంది.

హయత్ నగర్, అక్టోబర్ 31 ప్రభాతవార్త: సర్దార్ వల్లభయ్ పటేల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం హయత్ నగర్ పోలీసుల ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి హాజరై జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. హయత్ నగర్ సీఐ నాగరాజు గౌడ్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్

ఇందిరాగాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చౌకి రవికుమార్, మహమ్మద్ గౌస్ తదితరులు

బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇంద్రాగాంధీకి నివాళులర్పిస్తున్న తోటకూర వజ్రేష్ యాదవ్ , పోగుల నరసింహారెడ్డి , మాజీ కార్పొరేటర్లు , కాంగ్రెస్ నాయకులు

ఉప్పల్ చౌరస్తాలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు



దిల్‌సుక్‌నగర్ రాజీవ్‌చౌక్ వద్ద ఇందిరమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శశిధర్‌రెడ్డి

ముసారాంబాగ్ కృష్ణ తులసి నగర్ కమ్యూనిటీ హాల్ లో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి

హయత్‌నగర్‌లో ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ కు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, నాయకులు

కార్పొరేషన్‌లోని నందిహిల్స్ చౌరస్తాలో వల్లభాయ్ పటేల్ జయంతిని నిర్వహిస్తున్న పనునూరి బిక్షపతివారి, ద్యాసాని తిరుపతిరెడ్డి

ఇందిరా గాంధీ ,వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలు ఎనలేనివి

ఉప్పల్‌లో రాచకొండ పోలీసుల ఆధ్వర్యంలో ఏక్తా రన్

ప్రారంభించిన సిపి సుధీర్‌బాబు - హాజరైన ప్రముఖులు, పోలీసులు

ఉప్పల్, అక్టోబరు 31 ప్రభాతవార్త : సర్దార్ వల్లబాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రాచకొండ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉప్పల్ చౌరస్తాలో ఏక్తా దివస్, రన్ ఫర్ యూనిటి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, సినీ గేయ రచయిత ఆనంత శ్రీరామ్, ఎవరెస్ట్ అధిరోహించిన అన్వితరెడ్డి, క్రీడాకారిణి, కల్పన, డిసిపి పద్మజారెడ్డి, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సిపి సుధీర్‌బాబు మాట్లాడుతూ దేశంలోని పౌరులందరూ ఏకతాటిపై ఉన్నారనే తెలియజేసేందుకు రన్ ఫర్ యూనిటి కార్యక్రమం చేపట్టారని తెలిపారు. సర్దార్ వల్లబాయ్‌పటేల్ జయంతిని దేశమంతా వేడుకలు చేసుకోవడం అభినందనీయమన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా రాచకొండ పోలీసుల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. భారతదేశాన్ని ఐక్యంగా ఉంచడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి అభినందనీయమన్నారు. దేశ సమగ్రతకు కాపాడేందుకు యువత కావాలని ఆయన సూచించారు. సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ మాట్లాడుతూ పోలీసు అ

ఉప్పల్ చౌరస్తాలో ఏక్తా రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న రాచకొండ సిపి సుధీర్‌బాబు, గేయ రచయిత ఆనంత శ్రీరామ్, అన్వితరెడ్డి, కల్పన తదితరులు

మరవీరుల స్మంసరణ దినోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అమరులైన పోలీసుల త్యాగాలు మరవలేనివన్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ చౌరస్తా నుంచి క్రికెట్ స్టేడియం వరకు పరుగు నిర్వహించారు. అనంతరం అతిథులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డిసిపి పద్మజారెడ్డి, క్రైమ్స్ డిసిపి అరవింద్ బాబు, అడిషనల్ డిసిపి వెంకటరమణ, పలువురు పోలీసు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిఘా మనందరి భాధ్యత : భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఉద్యోగులు

నాచారం, అక్టోబర్ 31 ప్రభాతవార్త : నిఘా జాగృతి వారోత్సవాల్లో భాగంగా సందర్భంగా (బెల్) భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం వినీతి నిర్మూలన పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పారిశ్రామిక ప్రాంతం, నివాస ప్రాంతాలలో అవినీతి నిర్మూలన పాదయాత్ర కొనసాగిందివ. ఈ పాదయాత్రలో సంస్థ జనరల్ మేనేజర్ (ఈడబ్ల్యూఎన్ఎస్)అండ్ యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్, మరో జీఎం (ఈడబ్ల్యూఎల్ఎస్) డా. విశ్వనాథం సారధ్యంలో దాదాపు 400 మంది అధికారులు, కార్మికులు పాల్గొన్నారు. ర్యాలీలో పాల్గొన్నవారు అవినీతి నిర్మూలన టి...షర్ట్స్ ధరించి, బ్యానర్లు,ప్లే కార్డులతో "అవినీతి నిర్మూలన జరుగాలి దేశం అభివృద్ధి చెందాలి" అని నినాదాలు చేస్తూ తమ వంతు కృషిగా ప్రజలలో చైతన్యం తేవడానికి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా సంస్థ జనరల్ మేనేజర్ కే.శ్రీనివాస్ మాట్లాడుతూ అవినీతి నిర్మూలన కొరకు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ యందు చేపట్టిన వివిధ పద్ధతుల ద్వారా కార్మికులలో నేర్పరితనం మరియు పారద

బెల్ ఎదుట విజిలెన్స్ అవేర్ నెస్ ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు ఇతరులు

ర్శకత పెరిగాయని తెలిపారు. సంస్థ జనరల్ మేనేజర్ (ఈడబ్ల్యూఎల్ఎస్) డా విశ్వనాథం మాట్లాడుతూ అవినీతి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ హైదరాబాద్ నిర్వహించబడిన విజిలెన్స్ అవేర్నెస్ వీక్ భాగంగా, సమగ్రతా ప్రతిజ్ఞ నిర్వహించారు. వెండర్స్ మీట్ నిర్వహించడం, ఉద్యోగులు, కళాశాల, పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించబడ్డాయి.ఈ ర్యాలీలో డివిజనల్ హెడ్స్, విజిలెన్స్ ఆఫీసర్ రూత్ బెక్కంతో పాటు దాదాపు 400 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవా కార్యక్రమాలు భేష్

సరూర్‌నగర్, అక్టోబర్ 31 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పూర్వ సరూర్‌నగర్ మండల పరిషత్ బడంగ్‌పేట్ మాజీ ఎంపిటిసి, సీనియర్ నాయకుడు పెద్దబావి ఆనంద్‌రెడ్డి అన్నారు. బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ అంబేద్కర్‌నగర్‌లోనున్న ప్రభుత్వ పాఠశాలలో గత వారం రోజులుగా బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ ఎన్ఎస్ఎస్ యూనిట్ల విద్యార్థులు నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి బడంగ్‌పేట్ 1వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన ఆనంద్‌రెడ్డి ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహించిన డిగ్రీ కాలేజీ విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేషనల్ సర్వీస్ స్కీం (జాతీయ సేవా పథకం) కింద బడంగ్‌పేట్ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్లకు చెందిన విద్యార్థులు వారం రోజుల పాటు నాదర్‌గుల్ అంబేద్కర్‌నగర్‌లో క్యాంపును నిర్వహించి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ముఖ్యంగా మద్య పానం, డ్రగ్స్, ప్లాస్టిక్ వాడకం, మూఢ నమ్మకాలు తదితర అంశాలపై ప్రజలను చైతన్యపరిచే విధంగా కార్యక్రమాలు చేయడంతో పాటు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల

బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న మాజీ ఎంపిటిసి పెద్దబావి ఆనంద్‌రెడ్డి: చిత్రంలో మాజీ కార్పొరేటర్ పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ద్వారా విద్యార్థులు స్ఫూర్తిగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని పలు ప్రాంతాల్లో నిర్వహించి కాలేజీకి పేరు తీసుకురావాలని పెద్దబావి ఆనంద్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ పాత గ్రామ పంచాయతీ మాజీ వార్డు మెంబర్ పెద్దబావి మహేందర్‌రెడ్డి, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ సిహెచ్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ ఎన్.జ్యోతి, డాక్టర్ వెంకట్‌రెడ్డి, డాక్టర్ రామరాజు, డాక్టర్ రేవతి, నరసింహరాజు, నరసింహ, కిరణ్మయి, పలువురు అధ్యాపకులు, స్థానిక నాదర్‌గుల్ ప్రాథమికోన్నత పాఠశాల హెడ్ మాస్టర్ లక్ష్మయ్య, ఉపాధ్యాయులు, డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐఎస్ఎస్ఓ జాతీయ క్రీడలు అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ ప్రారంభం

నాచారం, అక్టోబర్ 31 ప్రభాతవార్త : ఐఎస్ఎస్ఓ జాతీయ క్రీడలు అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2025...26 పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భారతదేశం అంతటా ఐబీ, కేంబ్రిడ్జ్, జర్మన్, అమెరికన్ బోర్డుల వంటి అంతర్జాతీయ పాఠ్యాంశాలను అందించే 90 ప్రముఖ పాఠశాలల నుంచి 800 మందికి పైగా అథ్లెట్లను ఒకచోటకు చేరారు.ఇంటర్నేషనల్ స్కూల్స్ స్పోర్ట్స్ ఆర్గనైజేషన్ ద్వారా ఈ కార్యక్రమం జరుగుతోంది. అయితే ఈ సంస్థ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జీఎఫ్ఐ), ఇంటర్నేషనల్ స్కూల్ స్పోర్ట్ ఫెడరేషన్ రెండింటి ద్వారా అధికారికంగా గుర్తింపు పొందింది. ఈ ఛాంపియన్‌షిప్ అంతర్జాతీయ పాఠ్యాంశ పాఠశాలలకు అగ్రశ్రేణి పోటీ వేదికగా మారింది. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్ సహహోస్ట్ చేస్తోంది. ఇది విస్తృతమైన విద్య, లాజిస్టికల్, హాస్పిటాలిటీ మద్దతును అందించింది. అయితే ఐఎస్ఎస్ఓ అన్ని ఫీల్డ్, ట్రాక్ ఈవెంట్‌ల కోసం గచ్చిబౌలి స్టేడియంలోని ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను ఉపయోగించుకుంటుంది. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఉత్సాహభరితమైన మార్చ్‌ఫాస్ట్, ఐఎస్ఎస్ఓ అథ్లెట్ ప్రమాణం జరిగింది. అక్టోబర్ 30 నుంచి నవంబర్ 1 వరకు బాలురు, బాలికల కోసం అండర్14, అండర్17, అండర్

పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

19 విభాగాలలో స్ప్రింట్‌లు, రిలేలు, దూరపు రేసులు, జంప్‌లు, త్రోలో మూడు రోజుల పాటు తీవ్రమైన పోటీ జరుగుతుంది. ఈ సందర్భంగా ఐఎస్ఎస్ఓ డైరెక్టర్ ఆకాంక్ష థాపక్ మాట్లాడుతూ అథ్లెటిక్స్ క్రమశిక్షణ, ఓర్పు, పోటీతత్వంతో ఉండాలన్నారు. అదానీ గ్రూప్ ప్రాథమిక భాగస్వామిగా, క్వా అనేది హైడ్రేషన్ భాగస్వామిగా మద్దతు ఇస్తున్న ఈ ఛాంపియన్‌షిప్. ప్రతి విభాగంలో నాణ్యత, భద్రత, సమగ్ర అథ్లెట్ అభివృద్ధిని నిర్ధారించే ఐఎస్ఎస్ఓ దార్శనికతను కొనసాగిస్తుంది.ప్రముఖ ఐబీ, కేంబ్రిడ్జ్, జర్మన్, అమెరికన్ పాఠ్యాంశ పాఠశాలల ప్రాతినిధ్యంతో, హైదరాబాద్ ఎడిషన్ ఐఎస్ఎస్ఓ ఖిఒకే దార్శనికత. ఒకే స్పోర్టింగ్ నేషన్ అనే లక్ష్యంతో భారతదేశంలోని యువతలో క్రీడల ఐక్యత, శ్రేష్ఠత, స్ఫూర్తిని నింపేందుకు ముందుకొచ్చింది.

ఉచిత ఔషధ మొక్కల పంపిణీ

ఔషధ మొక్కలను పంపిణీ చేస్తున్న ఏ.సి.పి.కాశిరెడ్డి, భావన శ్రీనివాస్.

వనస్థలిపురం. అక్టోబర్.31.ప్రభాతవార్త కార్తీక మాసం క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా జాగృతి అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో వనస్థలిపురం గణేష్ టెంపుల్ సమీపంలోని "మొదటి ముద్ద" వద్ద ఉసిరి, తులసి, మారేడు, కలబంద, ఇన్సులిన్, అశ్వగంధ, రణపాల, గోరింటాకు లాంటి 17 రకాల ఔషధ, పండ్ల, పూల మొక్కల పంపిణీకి ముఖ్య అతిథిగా వనస్థలిపురం ఎసిపి పల్లె కాశి రెడ్డి విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. కాశి రెడ్డి మాట్లాడుతూ మన పూర్వికులు రూపొందించిన పండుగల పరమార్థం అంతా పర్యావరణ/ఆరోగ్య పరిరక్షణే అని ప్రత్యేకించి కార్తీకంలో సి విటమిన్ సమృద్ధిగా ఉండే ఉసిరిని ఏదొక రూపంలో కడుపులోకి తీసుకోవాలని, ఉసిరి చెట్టుకి పూజలు చేయాలంటే చెట్లు పెంచుకోవాలని, చలికాలం కాబట్టి ఊపిరి తిత్తుల సంబంధిత వ్యాధులు రాకుండా ఉసిరి కాపాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగనాథ్, గాంధి, యాదా రామలింగేశ్వరరావు, చిత్తలూరి వేణు మాధవ్, గోపాల్ దాస్ రాము, రవీందర్ రెడ్డి, గుద్దేటి నర్సింహులు, పెయింటర్స్ యూనియన్ అధ్యక్షులు మెండెం లక్ష్మణ్, యోగా మాస్టర్ రాకేష్, ఓబులేష్ యాదవ్, పాల్గొన్నారు.

చరిత్రకు నూతన దిశ చూపిన గ్రంథపాలకుడు సంగిశెట్టి శ్రీనివాస్

నేరెడ్ మెట్, అక్టోబర్ 31:ప్రభాతవార్త : మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్‌గా విశిష్ట సేవలందించిన సంగిశెట్టి శ్రీనివాస్ పదవీ విరమణ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఘన వీడ్కోలు సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ సామాన్య కుటుంబం నుండి ఎదిగి పరిశోధన, రచనల ద్వారా చరిత్రలో చిరస్మరణీయుడైన వ్యక్తి శ్రీనివాస్ " అని ప్రశంసించారు. ప్రిన్సిపాల్ బండి రాజు,సినీ దర్శకుడు బి. నరసింహరావు, చరిత్ర పరిశోధకుడు సుంకిరెడ్డి నారాయణరెడ్డి, పూర్వ సంపాదకులు కె. శ్రీనివాస్, సంయుక్త సంచాలకుడు ప్రొఫెసర్ బాలభాస్కర్, రాజా సింగ్ తదితరులు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా డా. జగన్ వ్యవహరించగా, అధ్యాపకులు, విద్యార్థులు, చరిత్రాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కమలానగర్‌లో నూతన సిసి రోడ్డు ప్రారంభం

పీర్జాదిగూడ కమలానగర్ లో నూతన సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న మాజీ మేయర్ అమర్ సింగ్ , శివకుమార్ గౌడ్ ప్రసన్న శ్రీధర్ రెడ్డి ,

మేడిపల్లి , అక్టోబర్ 31 ప్రభాతవార్త ; పీర్జాదిగూడ కార్పొరేషన్ కమలా నగర్ కాలనీలో కొత్త సిసి రోడ్డు ప్రారంభించబడింది .ముఖ్య అతిథిగా మాజీ మేయర్ అమర్ సింగ్ హాజరయ్యారు.కార్యక్రమంలోమాజీ డిప్యూ టీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ ,మాజీ కార్పొరేటర్ ప్రసన్న శ్రీధర్ రెడ్డి, హనుమాన్ దేవాలయం డైరెక్టర్ ప్రశాంత్,13వ డివిజన్ నాయకులు కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

బోడుప్పల్ కార్పొరేషన్‌లో మున్సిపల్ అధికారులు దాడులు

బోడుప్పల్ ,అక్టోబర్ 31 ప్రభాతవార్త ; బోడుప్పల్ నగర పాలక సంస్థ యందు ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న పలు దూకాణములలో సానిటరీ ఇన్స్పెక్టర్స్ శ్రీనివాస్ రెడ్డి, సంగీత ప్లాస్టిక్ టాస్క్ ఫోర్స్ టీమ్ దాడులు నిర్వహించి పట్టుకోవడం జరిగింది.నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తున్నందున జారిమాన 35,000/ రూపాయలు విధించడం జరిగినది.ఈ సందర్భంగా కమీషనర్ శైలజ మాట్లాడుతూ... ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణమునకు హానికరం క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఉన్నందున నిషేదించడం జరిగినది. ప్లాస్టిక్ వాడకమ్ తగ్గించి పర్యావరణ పరిరక్షణకు తొడ్పాడాలని తెలిపారు. అదే విధముగా ఎవరైనా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తే భారీ జరిమానతో పాటు కఠిన చర్యలు చేపట్టబడునని హెచ్చరించారు. కావున ప్రజలు స్వచ్ఛ, ప్లాస్టిక్ రహిత బోడుప్పల్ కు సహకరించాలని కోరారు.

ఘనంగా పోచమ్మ అమ్మవారి దేవాలయం శంకుస్థాపన

కార్యక్రమంలో పాల్గొన్న ఎగ్గే మల్లేశం, గోల్కొండ మైసయ్య

ఎల్.బి.నగర్, అక్టోబర్ 31 ప్రభాతవార్త: శ్రీపోచమ్మ అమ్మవారి దేవాలయం నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నాగోల్ డివిజన్ జైపురికాలనీలోని శ్రీపోచమ్మ అమ్మవారి దేవాలయం పునర్ నిర్మాణం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శంకుస్థాపన మహోత్సవం ఉదయం 10.36 గంటలకు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య దేవాలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం దేవాలయం చైర్మన్ గోల్కొండ మైసయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు పెద్దఎత్తున అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, గడ